## సీకేఎం కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ, జూన్ 27: దేశాయిపేటలోని ప్రభుత్వ సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బోధించేందుకు అతిథి అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్ ఒక ప్రకటనలో కోరారు. ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, తెలుగు, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, బాటని సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు, కామర్స్‌లో రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 1న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. 2న ఉదయం 10.30 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

## 29న జాబ్ మేళా

కాశీబుగ్గ, జూన్ 27: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 29న ములుగురోడ్డు ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్ పరిధిలోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో వరంగల్, హనుమకొండలో పని చేసేందుకు దాదాపు 50 ఉద్యోగాల ఎంపిక కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ పూర్తి చేసిన వారు 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి సొంత ద్విచక్ర వాహనం, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వేతనం నెలకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ములుగురోడ్డులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9177097456 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అరుణ

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

కాశీబుగ్గ, జూన్ 27: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి తమ లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వ మట్టెవాడ హైస్కూల్ ప్రిన్సిపాల్ అరుణ సూచించారు. పాఠశాల ప్రాంగణంలో టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులతో గురువారం సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. విద్యార్థుల జీవితంలో ఎస్సెస్సీ ఎంతో మలుపు అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT JAYASHANKAR BHUPALPALLY

O.S.No. 247 of 2023

Between:
Sunkara Govardhan Rao ...Plaintiff
And
Namani Naveen and others ...Defendants

COURT NOTICE

To,
Defendant No.2 - Namani Yugender, S/o: Late Sri Laxmi Narsaiah, Age: 45 years, Occu: Head Constable No.1884, AR, Police Head Quarters, Hanamkonda.
Sir,
Please take notice that, the plaintiff filed the above suit along with application for the relief of temporary injunction against you and the other defendants. As per the orders of the Hon'ble Court, the plaintiff sent the notices and summons to you several times, but you willfully avoid/evade to receive the same. As a last chance, the Hon'ble Court fixed the date and time on 11-07-2024 at 10.30 a.m., for your appearance. You must be appear before the Hon'ble Court, either in person or duly appointed counsel, failing which, the matter will be decided in your absence, by setting you ex parte.
// By order of the Hon'ble Court //
Dt:27-06-2024
Sd/- SAINDLA NAGARAJU
Advocate,
H.No.21-5-42/L/A/1, GMR Venture,
Manjoor Nagar, Bhupalpally,
Jayashankar Bhupalpally District



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MASHUQ RABBANI SOHAIL MOHAMMED (New Name) previously called MOHAMMED M R SOHAIL (Old Name) and Residing at H.No. 16-1-846, SRR Thota, Kareemabad, Warangal Dist. T.S., India Solemnly declare.
NTW-000

CHANGE OF NAME

★I, SHAMSHUDDIN SULTAN ALI DHANANI, R/o. 8-9-183, Polavari Street, Sadashiva Nilayam, Warangal, Telangana. Changed My Name as SHAMSHUDDIN DHANANI.
NT-328263

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557


# కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండ

- పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

నర్సంపేట రూరల్: నాగరాజు కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేటరూరల్, జూన్ 27: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ ఎల్లవేళలా అండగా నిలుస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జినుకల నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును గురువారం పెద్ది పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు. కార్యకర్తలకు ఏదైనా జరగరానిది జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎంతో ముందుచూపుతో పార్టీ తరఫున ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం కార్యకర్తలపై ఆయనకు ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. పార్టీలో సాధారణ లేదా క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తల్లో ఎవరైనా ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబానికి బీఆర్‌ఎస్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నదన్నారు. పార్టీ పరంగా ఒక్కో కార్యకర్తకు రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లింపులో బీఆర్‌ఎస్ దేశంలోనే ముందు వరసలో ఉందని స్పష్టం చేశారు. సభ్యత్వం తీసుకున్న అన్ని వర్గాల వారికి బీమా వర్తించేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌ను ఆగస్టు వరకు పొడిగించినట్లు చెప్పారు. అదేవిధంగా దుగ్గొండి మండలం పొనకల్ గ్రామానికి చెందిన మైనాల బాబురావు కుటుంబ సభ్యులకు కూడా రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, సుకినె రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ జగన్, మాజీ సర్పంచ్‌లు కొడారి రవన్న, వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, వంగేటి అశోక్, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, ఈర్ల నర్సింహరావు పాల్గొన్నారు.

**బాధితులకు పెద్ది పరామర్శ**

నల్లబెల్లి: పలువురు బాధితులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మండలకేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వైష్ణవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జడ్పీటీసీ బానోత్ హరినాథ్‌సింగ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఇటీవల మృతి చెందిన సలేంద్ర రామ్మూర్తి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ సర్పంచ్ రాజారాం, పార్టీ గ్రామ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, నాయకులు పాండవుల రాంబాబు, సుభాష్ ఉన్నారు.

## ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

**సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కళావతి**

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం, జూన్ 27: మండలాభివృద్ధి కోసం ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ కందకట్ల కళావతి సూచించారు. మండల చివరి సర్వసభ్య సమావేశం గురువారం సంగెం రైతు వేదికలో ఎంపీపీ కళావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా నివేదికలను అధికారులు సభలో చదివి వినిపించారు. సంగెం ఎంపీటీసీ మల్లయ్య, గవిచర్ల ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, సంగెం పీఏసీఎస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ తమ గ్రామాల్లోని ఊర చెరువుల తూములు లీకయ్యాయని, త్వరితగతిన మరమ్మతులు చేయాలని ఐబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కుంటపల్లి, వెంకటాపురంలో ప్రజా గ్రంథాలయాలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. సంగెం బీసీ హాస్టల్‌లో విద్యార్థులు లేనందున దాన్ని బాలికల హాస్టల్‌కు వినియోగించేలా సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే, సంగెం మండలకేంద్రంలో సామూహిక మరుగుదొడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు ఏం చేస్తున్నారో సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ ఐదేళ్లపాటు తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. సభలో జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్, అధికారులు యాకయ్య, ఎన్.విజయ్‌కుమార్, డాక్టర్ వి.రాజు, రమేశ్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

పాకాలకు చేరిన బోటు

## త్వరలో పాకాలలో బోటు షికారు

**పునఃప్రారంభించేందుకు అధికారుల ఏర్పాట్లు**

ఖానాపురం, జూన్ 27: పాకాలలో త్వరలోనే బోటు షికారు పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు అటవీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. పాకాల సరస్సుకు గురువారం బోటును తీసుకొచ్చారు. కొన్నేళ్లుగా పాకాలలో బోటు షికారు సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాకాల సరస్సులోకి గోదావరి జలాలను తీసుకొచ్చి శాశ్వత జలవనరులు కల్పించడంతో సరస్సు ఏడాది పొడవునా జలకళ సంతరించుకుంటున్నది. కాగా, ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు ప్రైవేట్ ఏజెన్సీకి సంబంధించిన బోటును తీసుకొచ్చారు. కొద్దిరోజులపాటు సరస్సులో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిసింది. పర్యాటకుల సంఖ్య బాగా ఉంటే అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేలా, లేకుంటే ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. జూలై 1న ఎమ్మెల్యే దొంతి లేదా జూలై 5న రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా బోటింగ్‌ను పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## ప్రైవేట్ లెక్చరర్‌కు డాక్టరేట్

గౌతమి

నర్సంపేటరూరల్, జూన్ 27: ముగ్దుంపురంలోని జయముఖి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ శిరంశెట్టి గౌతమి డాక్టరేట్ అందుకుంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఆమె ఇంప్రూవ్డ్ బీఈఆర్‌టీ అల్గోరిథం ఫర్ సెంటిమెంట్ అనాలిసిస్ అంశంపై గౌతమి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకుంది. ఈ సందర్భంగా గురువారం ఆమెను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

## అధికారులు వివరాలతో సిద్ధంగా ఉండాలి

**పోలీస్ శాఖ పటిష్ట భద్రత కల్పించాలి**

**సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష**

వరంగల్ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలావరంగల్, జూన్ 27: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారదాదేవి సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్కు సమీపంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మహిళా శక్తి పథకం కింద మహిళలకు ముఖ్యమంత్రి చేతులమీదుగా అందించనున్న చెక్కుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న హెల్త్‌సిటీ సందర్శనకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా పోలీసు శాఖ ద్వారా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పూర్తి సౌకర్యాలతో కూడిన అంబులెన్స్, ఫైరింజన్ వెహికల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హనుమకొండ జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని కలెక్టర్ చెప్పారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ పర్యటనను విజయం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అధికారుల వద్ద పూర్తి సమాచారం ఉండాలి

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, జూన్ 27: గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి వస్త్ర పరిశ్రమను సందర్శించారు. సీఎం హెలికాప్టర్ ద్వారా పార్కుకు చేరుకుంటారని ఆయన చెప్పారు. పార్కుకు కేటాయించిన భూముల సమగ్ర వివరాల మ్యాప్, పార్కులో ఏర్పాటైన పరిశ్రమల ఫొటో గ్యాలరీని ముఖ్యమంత్రి పరిశీస్తారని తెలిపారు. టీఎస్‌ఐఐసీ అధికారులు పార్కుపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండలని సూచించారు. ఫొటో ఎగ్జిబిషన్ అనంతరం టీఎస్‌ఐఐసీ అధికారులతో పార్కులో మౌలిక వసతుల కల్పనపై సమీక్షిస్తారని వెల్లడించారు. అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాలని కోరారు. పోలీసులు పూర్తిస్థాయిలో బందోబస్తు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంపీపీ భీమగాని సౌజన్య, డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుపతి పాల్గొన్నారు.

## గుట్కా, సారా పట్టివేత

నెక్కొండ : బెల్లం పానకం, సారాను స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

గిర్మాజీపేట/నెక్కొండ, జూన్ 27: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం పోలీసులు దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లతోపాటు నాటు సారాను పట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధి గణేశ్‌నగర్‌లోని పాన్‌షాప్ నిర్వాహకుడు వంగరి అరుణ్ వద్ద రూ. 6,950 విలువైన పొగాకు ఉత్పత్తులను పట్టుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. అనంతరం విచారణ కోసం నిందితుడిని ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నెక్కొండ మండలం చెరువుముందరితండా, కున్సోత్ తండాల్లో ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐలు నరేశ్‌రెడ్డి, రమేశ్‌చందర్, నెక్కొండ ఎస్సై మహేందర్, ఎక్సైజ్ ఎస్సై శిరీష 36 లీటర్ల నాటు సారా, 1200 లీటర్ల చక్కెర పానకం, రెండు బైక్‌లను సీజ్ చేశారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇద్దరు అదృశ్యం

ఖిలావరంగల్, జూన్ 27: వరంగల్‌లో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైనట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. కరీమాబాద్‌కు చెందిన ఎండీ ఇర్ఫాన్(21) ఈ నెల 25న నెక్కొండలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. అలాగే, నగరంలోని సాయినగర్‌కు కాలనీకి చెందిన శ్రీరామోజు సుక్కమ్మ(80) మతి స్థిమితం సరిగా లేక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఎనుమాముల మార్కెట్‌లో పలు టెండర్లు ఖరారు

**కార్యదర్శి ధరావత్ రెడ్డినాయక్**

కాశీబుగ్గ, జూన్ 27: వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో పారిశుధ్యం, క్యాంటీన్, టాయిలెట్స్ క్లీనింగ్, వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో క్లీనింగ్‌కు 11 నెలల నిర్వహణ కోసం టెండర్లను ఖరారు చేసినట్లు కార్యదర్శి ధరావత్ రెడ్డినాయక్ గురువారం తెలిపారు. మిర్చి యార్డు క్లీనింగ్‌కు మార్కెట్ కమిటీ రూ. 8 లక్షలు నిర్ణయించగా, ఆరు దరఖాస్తులు వచ్చాయి. జె.ప్రణయ్ రూ. 4.95 లక్షలు, కాటన్ యార్డుకు రూ. 5 లక్షలు నిర్ణయించగా, మూడు దరఖాస్తులు వచ్చాయి. సీహెచ్ సుధాకర్ టెండర్‌ను రూ. 5 లక్షలకు పొందాడు. పసుపు యార్డుకు రూ. 5.50 లక్షలు నిర్ణయించగా, మూడు దరఖాస్తులు రాగా, వి.నర్సింగ్ రూ. 3,99,930లకు దక్కించుకున్నాడు. ధాన్యం యార్డుకు రూ. 3.30 లక్షలు నిర్ణయించగా, కె వెంకటేశ్వర్లు రూ. 3,28,999 పొందాడు. లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌కు రూ. 18 లక్షలు నిర్ణయించగా, నలుగురు పోటీ పడ్డారు. అందులో చిండాలియా అర్జున్ రూ. 13.75 లక్షలకు, టాయిలెట్స్ నిర్వహణకు రూ. 9 లక్షలు నిర్ణయించగా, నలుగురు పోటీ పడ్డారు. అందులో పోలెపాక రమేశ్ రూ. 2.50 లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే, కాటన్ క్యాంటీన్‌కు రూ. 2.75 వేలు నిర్ణయించగా ముగ్గురు పోటీ పడ్డారు.

ఇందులో ఐలోని రాజు రూ. 3.80 లక్షలకు పొందినట్లు మార్కెట్ కార్యదర్శి రెడ్డినాయక్ తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు మార్కెట్ పరిధిలోని పాన్‌షాపుల నిర్వహణను రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే, మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న క్యాంటీన్‌కు నలుగురు దరఖాస్తులు చేసుకోగా, ముగ్గురు లక్ష రూపాయల డీడీలు ఇవ్వకపోడంతో ఆ టెండర్‌ను ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. కాగా, పత్తి, ఆపరాల యార్డుల్లో పారిశుధ్య పనుల నిర్వహణ టెండరుదారులు సిండికేట్‌గా మారి అధిక ధరకు పొందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాంపూర్‌లో బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న గౌతమ్

## పేదలకు అందుబాటులో దహన చార్జీలు

**ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతమ్**

వరంగల్, జూన్ 27: మోడల్ వైకుంఠధామంలో పేదలకు అందుబాటులో దహన సంస్కార చార్జీలు ఉండాలని ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి నగర పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన గ్రేటర్ పరిధిలోని మోడల్ వైకుంఠధామం, బయోమైనింగ్ ప్రాంతాలను కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. 57వ డివిజన్‌లోని మోడల్ వైకుంఠధామాన్ని పరిశీలించిన ఆయన నిర్వహణ బాధ్యతలను చూస్తున్న స్వయం సహాయక మహిళా సంఘాలతో మాట్లాడారు. దహన సంస్కారాలకు ఎంత చార్జీలు వసూలు చేస్తున్నారు? ఫోన్‌పే, గూగుల్ పే, జీడబ్ల్యూఎంసీ యాప్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ ఉందా? అని అడిగారు. లేకుంటే అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మరణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు గ్రేటర్‌కు అందించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను పరిశీలించిన ఆయన త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో పర్యటించిన ఆయన బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. బయోమైనింగ్ నత్తనడకన సాగుతున్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. బయోమైనింగ్ పూర్తయిన ప్రాంతాన్ని రెడిమినేషన్ చేయాలన్నారు. ఆ స్థలాన్ని పూల మొక్కలు, గ్రీనరీతో సుందరీకరించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వో రమేశ్, టీపీఆర్‌వో కోలా రాజేశ్‌కుమార్, ఈఈలు సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈ రవికుమార్, ఏఈ హరికుమార్ ఉన్నారు.

ట్రాక్టర్ డోజర్‌తో కాల్వను పునరుద్ధరిస్తున్న ఏఈ రత్నాకర్

## చెరువు కుడి కాల్వకట్ట పునరుద్ధరణ

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

నల్లబెల్లి, జూన్ 27: రంగాయ చెరువు కుడి కాల్వ కట్టను గురువారం ఏఈ రత్నాకర్ పునరుద్ధరించారు. కాల్వకట్టను ఓ రైతు ధ్వంసం చేసి సాగు భూమిగా మార్చడంపై నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ కాల్వ కట్ట ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని దేవాదుల అధికారులను ఆదేశించారు. దీంతో ఏఈ పంతులుపల్లె సమీపంలో ఆక్రమణకు గురైన కాల్వ కట్టను పరిశీలించారు. అనంతరం ట్రాక్టర్ డోజర్‌తో కెనాల్ కట్టను పునరుద్ధరించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## 'నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం స్పందించాలి'

నర్సంపేట, జూన్ 27: నీట్ పేపర్ లీకేజీపై నరేంద్రమోదీ ప్రభుత్వం స్పందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా పేపర్ లీకేజీపై ప్రస్తుత పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని, అవకతవకలపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, రవి, కృష్ణ, సారంగపాణి పాల్గొన్నారు.

## బల్దియా జేఏసీ నాయకులపై కరపత్రం కలకలం

**ఆరేళ్ల జమ, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**

వరంగల్, జూన్ 27: బల్దియా ఉద్యోగ, కార్మిక జేఏసీ నాయకులపై కరపత్రాల పంపిణీ కార్పొరేషన్‌లో కలకలం సృష్టించింది. ఏప్రిల్ 30 వరకు జేఏసీ అధ్యక్షుడిగా ఉన్న గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోల్కొండ శ్రీను, కోశాధికారిగా ఉన్న బొట్ల రమేశ్‌పై కరపత్రంలో మిగితా జేఏసీ నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతి కొత్త సంవత్సరానికి ముద్రించే డైరీ, క్యాలెండర్ పేరిట వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఇతర వర్గాల నుంచి వసూలు చేసింది ఎంత? ఖర్చు చేసిన దానిపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. యూనియన్ సిల్వర్ జూబ్లీ వేడుకల పేరిట ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బ్యాంక్ నుంచి డ్రా చేసిన 2.50 లక్షల రూపాయల లెక్కలు చెప్పాలన్నారు. పది రోజుల్లో వీటికి సంబంధించిన లెక్కలు నివేదించాలని కరపత్రంలో కోరారు. అయితే, జేఏసీ అధ్యక్షుడు పదవి కాలంలో ఉన్నంత వరకు అంటకాగిన నాయకులు ఆయన విరమణ చేసిన తర్వాత కరపత్రం ద్వారా ప్రశ్నించడంపై కార్పొరేషన్ ఉద్యోగ, కార్మికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులు

కాశీబుగ్గ, జూన్ 27: ఆగస్టు 7న చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం చేనేత కళాకారుల కళా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకుడు జి.రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యం, ప్రత్యేకతల ఆధారంగా అందిస్తామని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు రూ. 25 వేల నగదు, చేనేత శాలువ, జ్ఞాపిక అందించి మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరిస్తామని తెలిపారు. 2023 డిసెంబర్ నాటికి 30 ఏళ్లు పైబడి చేనేత రంగంలో పది ఏళ్లకు తగ్గకుండా అనుభవం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. చేనేత డిజైనర్లు 2023 డిసెంబర్ నాటికి 25 ఏళ్లు పైబడి ఐదేళ్ల అనుభవం తగ్గకుండా ఉండాలని కోరారు. అసక్తిగల వారు జూలై 10లోగా సహాయ సంచాలకుడు, చేనేత–జౌళిశాఖ వరంగల్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. జూలై 15లోగా దరఖాస్తుదారు ఉత్పత్తిని మగ్గంపై తనిఖీ చేస్తామన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శ్రవణ్‌శాస్త్రిని సన్మానిస్తున్న ఎస్సై మహేందర్, విలేకరులు

## శ్రవణ్‌శాస్త్రికి పాత్రికేయుల సన్మానం

నెక్కొండ, జూన్ 27: ఆధ్యాత్మిక, వేద జ్యోతిష రంగాల్లో ఇటీవల ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న బూరుగుపల్లి శ్రవణ్ శాస్త్రిని గురువారం మండలకేంద్రంలో ఎస్సై మహేందర్‌తోపాటు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.వి.ఎస్.శాస్త్రి, గౌరవ అధ్యక్షుడు గిరగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మునిగె ప్రభాకర్, కోశాధికారి రామారపు రాము, సంయుక్త కార్యదర్శులు సంగని మధు, ఎలికట్టె శ్రీనివాస్, విలేకరులు పూర్ణచందర్, శ్యామ్, హేమచందర్, శ్రీనివాస్, సురేశ్, సైదులు, రాజనారాయణ, అరుణ్, గందె రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మృతి

వీరలక్ష్మి

ఖానాపురం, జూన్ 27: ధర్మారావుపేటకు చెందిన శతాధిక వృద్ధురాలు బొమ్మగాని వీరలక్ష్మి(106) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. మృతురాలికి కోడలు, మనువడు, మనువరాలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వీరలక్ష్మి దహన సంస్కారాల కోసం గ్రామానికి చెందిన విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో యువజన సంఘాల బాధ్యులు రూ. 20 వేల విరాళాలు, 25 కిలోల బియ్యం సేకరించి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో కుమారస్వామి, తోట రవికుమార్, వెంకటేశ్వర్‌రావు, వెంకన్న, కరుణాకర్ పాల్గొన్నారు.

## చీటింగ్ చేసిన వ్యక్తిపై కేసు

ఖిలావరంగల్, జూన్ 27: చిట్‌ఫండ్ పేరుతో ఇద్దరి వద్ద డబ్బులు వసూలు చేసి చీటింగ్ చేసిన పెరుకవాడకు చెందిన జోగు అజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు. తాను కపిల్ చిట్‌ఫండ్‌లో పని చేస్తున్నానని, చీటి వేయాలని అదే ప్రాంతానికి చెందిన కిరణ్‌కుమార్, రవికుమార్ వద్ద రూ. 1,67,700 తీసుకొని మోహం చాటేశాడు. బాధితులు కపిల్ చిట్‌ఫండ్ కార్యాలయానికి వెళ్లగా అజయ్‌కుమార్ తమ వద్ద పని చేయడం లేదని తెలిపారు. మోస పోయామని గ్రహించి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.